క్లుప్తంగా

వృద్ధురాలి అంత్యక్రియలకు ఆర్థిక సాయం



మృతురాలి కుటుంబీకులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: జీవీఎంసీ 38వ వార్డు యాసీన్ బాబా దర్గా దరి కంచరవీధిలో నివసిస్తున్న వేముల రత్నం (70) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆమె ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వృద్ధురాలి అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థిక సహకారం అందజేశారు. కార్యక్రమంలో 38వ వార్డు అధ్యక్షుడు సంకాభక్తుల సన్యాసిరావు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుజరాపు రవి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో పింఛన్ల పంపిణీ



వెంకటేశ్వరమెట్టపై పింఛన్లు పంపిణీ చేస్తున్న గోపీకృష్ణ

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం చురుగ్గా సాగింది. వలంటీర్లు తెల్లవారు జాము నుంచే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ కార్యక్రమంలో పాల్గొని వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయం పరిధిలో వెంకటేశ్వరమెట్టపై పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కన్వీనర్ ఆడారి వెంకట మహేష్, వార్డు మహిళా అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్మలు, వెంకటలక్ష్మి, వార్డు కార్యదర్శులు, సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి హుండీ ఆదాయం రూ.14.64 లక్షలు



టర్నల్ చౌల్ట్రీలో హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

అల్లిపురం: జగన్నాథ స్వామి హుండీల ఆదాయం పది రోజులకు గాను రూ.14,64,349 వచ్చిందని ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి తెలిపారు. టౌన్ కొత్త రోడ్డులోని జగన్నాథస్వామి దేవస్థానంలో రథ యాత్ర మహోత్సవాలు శుక్రవారంతో ముగియడంతో, శనివారం టర్నల్ చౌల్ట్రీలో ఉత్సవ ప్రధాన అధికారి కె.శిరీష, విశాఖ జిల్లా తనిఖీదారు బి.వసంతకుమార్ సమక్షంలో హుండీల లెక్కింపు చేపట్టినట్లు చెప్పారు. పదిరోజులకు గాను రూ.14.64 లక్షలు వచ్చిందని, గతేడాది కంటే రూ.1,92,206 అదనంగా వచ్చిందని తెలియజేశారు. స్వామి వారి రథయాత్రకు సహకరించిన వివిధ విభాగాల సిబ్బందికి, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

'మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదు'

సీతమ్మధార: ప్రధాని మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదని ఐఎన్‌టీయూసీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు 822వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంపై ప్రజలకు రోజురోజూ అసహనం పెరిగిపోతోందన్నారు. నిరంకుశ పద్ధతుల ద్వారా కార్మిక, ప్రజా ఉద్యమాలు అణచివేస్తే ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలను ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బి.నాగభూషణం, దేవుడు, అప్పన్న, సత్తిబాబు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో శీఘ్రగతిన సేవలు

- కలెక్టర్ మల్లికార్జున



సురక్ష క్యాంపులో నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జెడ్పీ కృష్ణ, కార్పొరేటర్ పూర్ణిమ



జోన్-5లోని క్యాంపులో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వాసుపల్లి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

కంచరపాలెం: ప్రజలకు శీఘ్రగతిన ప్రభుత్వ సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. 41వ వార్డు జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయం ఆవరణలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం, ఏ ఒక్కరూ మిగిలి పోకుండా అర్హులందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుబంధంగా చేపట్టిన జగనన్న సురక్ష ద్వారా సచివాలయాల వారీగా ప్రత్యేక క్యాంపులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నమన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాలు పొందేందుకు అవసరమైన పత్రాలను అందించి, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సుమారు 400 మంది వివిధ రకాల సేవలు కొరకు దరఖాస్తు చేసుకున్నట్లు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ తెలిపారు. సభకు వచ్చిన లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా కార్పొరేటర్ పూర్ణిమ సొంత నిధులతో మధ్యాహ్న భోజనంతో సహా సదుపాయాలు సమకూర్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, తోట పద్మావతి, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, ఎస్‌కేఎంఎల్ చైర్ పర్సన్ కొల్లి సింహాచలం, జేసీఎస్ ఇన్‌చార్జి నీలకంఠం, నాయకులు వేళంగిణి రావు, బోణి దేవా, లండా రమణ, లింగం శ్రీనివాస్, విష్ణు, పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. శనివారం జరిగిన జగనన్న 'సురక్ష' క్యాంపులో 461 టోకెన్లు రిజిస్టర్ చేయగా 396 టోకెన్లకు సంబంధించిన సర్టిఫికెట్లు అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు.

జగనన్న సురక్ష క్యాంపులో శనివారం జారీ చేసిన టోకెన్లు

సచివాలయం టోకెన్లు	నమోదు చేసిన టోకెన్లు		జారీ చేసిన టోకెన్లు	సిద్ధంగా ఉన్న క్యాంపులో నమోదు చేసినవి
జ్ఞానాపురం-1	119	104 15	76	(21086317)
జ్ఞానాపురం-2	113	89 18	52	(21086318)
సెబాస్టియన్ కాలనీ	172	153 40	68	21086319)
సుబ్బలక్ష్మినగర్	57	50 40	34	21086234)
మొత్తం :	461	396 113	230	

మా పిల్లలకు ధ్రువపత్రాలు వచ్చాయి



పిల్లల కుల,ఆదాయ ధ్రువపత్రాల కోసం సచివాలయంలో నమోదు చేసినా సర్టిఫికెట్ రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఈ పత్రాలు లేక సంక్షేమ పథకాలు కూడా అందలేదు. వలంటీర్ ఇంటికి వచ్చి సురక్ష క్యాంప్‌లో కచ్చితంగా సర్టిఫికెట్ ఇస్తారు అని వివరాలు నమోదు చేసుకుంది. ఈ రోజు మా పిల్లలకు ధ్రువపత్రాలు వచ్చాయి. ఆనందంగా ఉంది.

– పి.సంతోష్‌కుమారి, జ్ఞానాపురం

ఇబ్బంది తొలగింది



గతంలో సర్టిఫికెట్ లేక ప్రభుత్వ పథకాలు అందలేదు. గత వారంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వచ్చి వివరాలు నమోదు చేసుకుని సురక్ష క్యాంప్‌లో ఈ రోజు సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇలాంటి క్యాంపు నిర్వహించడం బాగుంది.

– సొనబోయిన దాసు, గెడ్డవీధి, జ్ఞానాపురం

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూలకు హాజరవడానికి వేచిచూస్తున్న యువత



ఇంటర్వ్యూలు జరుగుతున్న దృశ్యం



జాబ్‌మేళాలో సంస్థల వివరాలు చూసుకుంటున్న యువత

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా అనుసంధాన్ సంస్థ నిర్వహించిన జాబ్ మేళాకు విశేషస్పందన లభించింది. శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన జాబ్‌మేళా సాయంత్రం వరకు కొనసాగింది. మొత్తం 29 సంస్థలు పాల్గొన్నాయి. ఐటీ సంస్థల్లో 430, ఇతర సంస్థల్లో రెండు వేలకు పైగా ఉద్యోగాలు భర్తీకి జాబ్‌మేళా నిర్వహించినట్లు అనుసంధాన్ సంస్థ వ్యవస్థాపకుడు సిఈఓ అడ్ల సుభాష్ తెలిపారు. విద్యార్థులకు ముందుగా ఒక నిర్దిష్టమైన బయోడేటా ఫారం అందించి, నిర్వాహకులు వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థుల విద్యార్హతలకు అనుగుణంగా నియామక ప్రక్రియక జరిపారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు నిర్వాహకులు చేశారు. విద్యార్థులు కూర్చోవడానికి ప్రత్యేకంగా టెంట్లు, తాగునీరు, కుర్చీలు వంటివి ఏర్పాటు చేశారు. ఏయూ భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రవిభాగంలోని సమావేశ మందిరాల్లో ఇంటర్వ్యూల ప్రక్రియ నిర్వహించారు.

ఉపయుక్తంగా నిలిచింది



ఈసీఈలో ఇంజినీరింగ్ పూర్తిచేశాను. ఈ జాబ్‌మేళాలో పలు సంస్థల నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా జాబ్ మేళా నిలిచింది.

–బి.దీపిక, విశాఖపట్నం

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా..

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



ఎమ్మెల్యేను రాచపోలమాంబ అమ్మవారిని పండగకు ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. అశోక్‌నగర్, ఆశీలమెట్టలో గల ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం కార్యకర్తల గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, సీనియర్ నాయకులు.. కార్యకర్తకు కిడ్నీ ఆపరేషన్ జరిగిందని సీఎం రిలీఫ్ ఫండ్ కోసం వినతి పత్రం అందజేశారు. కార్యకర్తలకు ఇళ్ల కేటాయించాలని జీవీఎంసీ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అల్లిపురంలో వచ్చే మంగళవారం జరిగే రాచపోలమాంబ అమ్మవారి పండగకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మిదేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, జేసీజీ ఇన్‌చార్జ్ కర్రి నీలకంఠం, పీతల వాసు, అలుపున కనకరెడ్డి పాల్గొన్నారు.

బహుభాషలతో ఉపాధి అవకాశాలు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): ప్రస్తుత కాలంలో యువత మాతృభాషతో పాటు ఇతర భాషలూ నేర్చుకుంటే దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. శనివారం ద్వారకానగర్‌లోని గ్లయిక్ సాక్ కొరియన్ ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంస్థలో కొరియన్ భాష నేర్చుకుని ఆయా దేశాల్లో ఉద్యోగం పొందేందుకు అవకాశాలుంటాయన్నారు. అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ హెచ్.లజపతిరాయ్ మాట్లాడుతూ ఇటీవల విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో కొరియన్ పెట్టుబడుదారులు మన రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి ఆసక్తి చూపించారన్నారు.

95శాతం పింఛన్ల పంపిణీ



కల్లుపాకల్లో పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చురుగ్గా సాగింది. మొదటి రోజే 95శాతం పింఛన్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు వలంటీర్లు, కార్యదర్శులతో కలసి వార్డులో లబ్ధిదారులకు పింఛన్ అందించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం



చర్చా గోష్ఠిలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి



పాల్గొన్న ప్రజా సంఘాల నేతలు

సీతమ్మధార: పౌర ప్రజా సంఘాల వేదిక సమన్వయకర్త పి.చంద్రశేఖర్, భారత్ బచావో జిల్లా ప్రధాన కార్యదర్శి డా.పొన్నాడ శ్రీనివాస్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ స్వతంత్ర జర్నలిస్టు తులసి చందును హత్య చేస్తామని బెదిరింపులు, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ అజాద్‌పై కాల్పుల దాడి, ప్రజా ఉద్యమకారులపై ఉపా చట్టం పేరుతో చేస్తున్న దాడిని ఖండిస్తున్నామన్నారు. ప్రస్తుత పాలకవర్గం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తూ భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ×ఫాసిజాన్ని ఓడిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం× అని పిలుపునిచ్చారు. పీవోడబ్ల్యూ ప్రతినిధి లక్ష్మి మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకను అణచివేసేందుకు స్వదేశీ, విదేశీ జర్నలిస్టులను సైతం సోషల్ మీడియా వేదికగా అసభ్య పదజాలంతో దూషించడం, హత్యలకు పాల్పడటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు ఆర్‌వీఎస్ కుమార్, ఐద్వా నాయకులు ప్రియాంక, క్షేత్రపాల్, వెంకటేశ్వర్లు, అభిలాష్, చిన్నారావు, విమల, ఎ.భేగం, సూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళకు చీర అందజేస్తున్న చేస్తున్న కోలా గురువులు, శ్రీహరిరెడ్డి

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా 33వ వార్డు కుమ్మరవీధిలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు కేక్ కట్ చేశారు. సింగపూర్ ఎన్ఆర్ఐ పిల్లి సుభాష్‌రెడ్డి, పాల శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

- మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు జన్మదినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి పాల శ్రీహరిరెడ్డి, నీలాపు రమణారెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గురువులు కేక్ కట్ చేసి, అంగన్‌వాడీ చిన్నారులకు బిస్కట్లు, చాక్లెట్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో నీలాపు అయ్యప్పరెడ్డి, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ, కణితి బ్రహ్మం పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో..

మహారాణిపేట: కోలా గురువులు జన్మదినం సందర్భంగా ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన వేడుకల్లో గురువులు కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక మత్స్యకార మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మత్స్యకారులు మూగిరాజా, ఆనంద్, కామేష్, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు పూజబాక్సుల పంపిణీ

కంచరపాలెం: జ్ఞానాపురం బాబుకాలనీలో కోలా గురువులు జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గవర రమణ ఆధ్వర్యంలో మహిళలకు పూజా బాక్సులు పంపిణీ చేశారు. వృద్ధులకు పండ్లు అందజేశారు.

సమస్యలన్నీ సత్వరం పరిష్కరిస్తాం



కోటవీధిలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ ముహమ్మద్ సాధిక్ అన్నారు. వార్డులోని కోటవీధి, ఫెర్రీవీధి, అంబుసరంగ్ వీధుల్లో శనివారం ఆయన పర్యటించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయన్నారు. దీనివలన ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలన్నింటినీ ఇప్పుడు దశలవారీగా పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటికే కోటవీధిలో కాల్వల నిర్మాణం, పంజావీధిలో రహదారి నిర్మాణం చేశామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ , వీధిలైట్ల సమస్యలు కూడా త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్పొరేటర్ నిధులతో కాల్వల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు సాధిక్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా దూరవిద్య వ్యవస్థాపక దినోత్సవం



లంకపల్లి బుల్లయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న విశ్వేశ్వరరావు తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం 52వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ముందుగా దూరవిద్య కేంద్రంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య విగ్రహానికి కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు సైతం విద్యను చేరువ చేయడానికి దూరవిద్య ఒక సాధనంగా నిలిచిందన్నారు. 1972 సంవత్సరంలో ఎంతో దార్శనిక ఆలోచనలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. నాణ్యమైన విద్యను అందించడంలో ఏయూ దూరవిద్య కేంద్రం ముందుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ఎం.వి.ఎస్.చంద్రశేఖర్, ఆచార్య కె.సత్యనారాయణ, డాక్టర్ రాజు, డిప్యూటీ రిజిస్ట్రార్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు.

ఆర్‌ఎంపీల సేవలు మరువలేనివి

సీతంపేట: ఆర్‌ఎంపీ సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఆర్‌ఎంపీ వైద్యుల సేవలు మరువలేనివన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు అందిస్తున్న సేవలు మెరుగుపర్చుకుంటే బాగుంటుందన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు సేవలు ఎప్పటి నుంచో ఉంటున్నాయన్నారు. డాక్టర్ మురళీకృష్ణ క్యాన్సర్ గురించి ఆర్‌ఎంపీలకు అవగాహన కల్పించారు. రూ.2కే పేదలకు వైద్యం అందిస్తున్న విజయనగరం జిల్లా గరివిడికి చెందిన డాక్టర్ ఎ.ఎస్.ఆనంద్‌ను సత్కరించారు. జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, కార్యదర్శి ఎస్.సుగుణేశ్వరి, సలహాదారు ఎల్.ఎన్.రావు, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల శ్రీనివాసరావు, కె.ఎస్.రావు, న్యూరోసైక్రియాటిస్ట్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వనమహోత్సవంపై విద్యార్థుల ర్యాలీ

అల్లిపురం: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా అల్లిపురంలో గల శ్రీ కాశ్యప్ విద్యానికేతన్ విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెట్లు నాటడం, అడవులను కాపాడుకోవడం ద్వారా జీవన ప్రమాణాలను వృద్ధి చేసుకోవచ్చని పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను చెట్లు, జంతువులు బొమ్మలతో అలంకరించి ప్రజలకు చెట్లు ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు.

నేడు ప్రసాద వితరణ

మహారాణిపేట: సింహగిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు బిస్కెట్లు పంపిణీ చేయాలని స్టీల్‌ప్లాంట్ ఎంఎంఎస్‌ఎం విభాగ ఉద్యోగులు నిర్ణయించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఆరిలోవ క్యూ వన్ ఆస్పత్రి ఏరియాలో గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు బిస్కెట్లు, మంచినీరు పంపిణీ చేస్తున్నట్టు స్టీల్‌ప్లాంట్ ఎంఎంఎస్‌ఎం విభాగ ఉద్యోగులు ప్రకటించారు.

జిల్లా పరిషత్ చైరపర్సన్‌ను సత్కారం



జిల్లా పరిషత్ చైరపర్సన్ జె.సుభద్ర దంపతులను సన్మానిస్తున్న జిల్లా పరిషత్ అధికారులు

మహారాణిపేట: జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైరపర్సన్ జల్లిపల్లి సుభద్రను జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, కార్యాలయ, ఇంజనీరింగ్ సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా గాక కుటుంబ పెద్దగా వ్యవహరిస్తున్నారన్నారు. చిన్న స్థాయి ఈ స్థాయికి చేరుకున్న ఆమె అందరికీ ఆదర్శప్రాయమన్నారు.

పూర్వ ఆచార్యులకు ఘన సన్మానం



సన్మాన గ్రహీతలతో నేత్ర వైద్యశాల వైద్యులు,

సీతంపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలు, డాక్టర్స్ డే సందర్భంగా శనివారం నేత్ర వైద్య విభాగానికి చెందిన పూర్వ ఆచార్యులను ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, ప్రస్తుత నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ పి.విశ్వామిత్ర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పూర్వ ఆచార్యులు, వైద్యులు అహికృష్ణ, ఎం.ఎం.నాయుడు, రాఘవేంద్రరావు, ఎస్.వి.ఎల్.నరసింహారావు, భాస్కరరావు, టి.జయరాజు, పి.కృష్ణప్రసాద్, వి.వి.ఎల్.నరసింహారావు, సూతర్యనారాయణరాజు, వి.రాజేశ్వరరావు, ఎం.వి.ఎస్.ప్రసాదరావు, ఎ.తారకేశ్వరరావులు సత్కారం పొందారు. కార్యక్రమంలో ఆస్పత్రి నేత్ర వైద్యులు, సిబ్బంది, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు.

బీసీ సదస్సు నేడు

మద్రిపాలెం: ఈ నెల 2న జరిగే బీసీ సదస్సును విజయవంతం చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్ పిలుపునిచ్చారు. 51వ వార్డు మాధవధార వుడా కాలనీలోని కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ సంయుక్తంగా మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ సదస్సు నిర్వహిస్తాయని తెలిపారు. ఈ సమావేశానికి ఏఐబీసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు, బీసీ హక్కుల ఉద్యమ నేత, రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య హాజరవుతారన్నారు. మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏఐబీసీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.